1987 దీపావళి కథల పోటీలో రు.700/-లు బహుమతి పొందిన కథ

# జాతస్య హి ధృవోమృత్యు....

## దూరంగా సముద్రం...

కడుపులో కొండెత్తున లేచిన అలలు తీరాన్ని చేరేసరికి చిన్నవై పోతూ.... చిన్నవై..... ఇంకా చిన్నవై నురుగుగా మారిపోతూ....

ఆ నురుగులోని బుడగలు కూడా టప్మని పేలి, గాలి గాలిలో కలిసిపోగా, నీరు ఇసుకలో ఇంకిపోగా, ఉత్త తడి ఇసుకను మిగులుస్తూ.....

ఎన్ని నిమిషాలు ఎన్నిగంటలు చూసినా అదే దృశ్యం.

"జాతస్య మరణం ధృవం " అన్న నిజాన్ని నొక్కినొక్కి చెప్తున్నట్లు! మనసులో భావాలు కూడా సముద్రపుటలలతో పోటీ పడుతున్నాయి

ఇన్నాళ్ళూ ఇన్నేళ్ళూ నేను సాగరితో పంచుకొన్న జీవితం పంచుకొన్న అనుభూతులూ పంచుకొన్న అనురాగాలూ అన్నీకూడా ఈ సముద్రపు టలల్లాగే నాశనమైపోయి కేవలం జ్ఞాపకాల నురుగుకింద మారిపోతాయేమో?

ఆ జ్ఞాపకాల నురుగుకూడా ఎప్పటికో మనసు అట్టడుగుపొరల్లోకి ఇంకిపోయి తడితడిగా వున్న జాలి మనసు మిగులుతుందేమో

ఏమో" ఆ ఏమో అన్న ప్రశ్న ప్రొద్దుటినుండి మనసుని నులిమేస్తూనే ఉంది

ఒళ్ళంతా కత్తులతో పొడిచి ఉప్పుకారం రాసినట్లు మనసుని చిత్రవధ చేస్తూనే ఉంది

ఆ 'ఏమో' అన్న ప్రశ్న మనసులో గుచ్చుకొన్న పదునైన కత్తిగా మారడానికి కారణం ఓ కుక్క



అరుపు!

మామూలు అరుపుకాదు అదివేసన ఊళ?

ఇంకా పూర్తిగా తెల్లవారకముందు మృత్యు దేవతను ఆహ్వానిస్తున్నట్లు ఆ కుక్క వేసిన ఊళ ఇంకా మనస్సులో అలా గింగుర్లు తిరుగుతూనే ఉంది

అసలెందుకు భయపడాలి నేను?

భయం ఆ కుక్క వేసిన ఊళలో ఉందా?

నా మనస్సులో ఎక్కడో నాకు తెలియకుండానే ఉన్న నమ్మకంలో వుందా? పొద్దున్నే విన్న కోటయ్య మాటల్లో ఉందా??

గంటన్నరనుంచి సముద్రాన్ని చూస్తూ ఆదే ఆలోచిస్తున్నాన్నేను

అమెరికన్ ఆస్పత్రి డాబామించి అలా చూస్తుంటే ఆ సముద్రం మృత్యుదేవత గర్భ కుహరంలా వుంది

సముద్రం మీంచి వస్తున్న గాలి అతి చల్లగా మృత్యుదేవత కౌగిల్లా ఉంది

ఆస్పత్రి గోడల పెద్దపెద్ద రాళ్ళు మృత్యులోకపు మెట్లలా ఉన్నాయి

ఇలా అనుకోకూడదని పొద్దున్ననించీ అనుకుంటూనే ఉన్నాను అనుకోకుండా ఉండలేక పోతున్నాను

పొద్దున్నే యింకా వెలుగు చీకటిని తనలో పూర్తిగా కరిగించుకోకముందు జరిగిందది.

* * * *

తెలతెల వారుతుండగానే నిద్రలేపి సాగరికి నొప్పులు మొదలవుతున్నాయన్న ఆ కబురు అత్తగారు చెప్పగానే మనసు అడుగుపొరల్లో దాక్కొన్న ఆందోళన లావాలా బుస్సున పొంగింది

నాలుగు రోజుల క్రితమే చేర్పించాం తనని ఆస్పత్రిలో

అప్పట్నించీ నాదీ అత్తగారిదీ ఇద్దరి మకాం ఆస్పత్రిలోనే

చేర్పించిన దగ్గర్నుంచి క్షణక్షణమూ ఆందోళనే! క్షణక్షణమూ భయమే! ఇప్పటికే రెండుసార్లు పురిటి సమయంలో మృత్యువుతో పోరాడింది సాగరి. ఆమె కడుపులో వున్న బిడ్డా.

రెండుసార్లూ సాగరి గెల్చింది కానీ ఆమె కడుపులోని బిడ్డలు ఓడిపోయారు

మనకి బిడ్డలొద్దూ ఎవరూ ఒద్దూ అంతగా కావాలంటే ఎవరినైనా పెంచుకుందాం నేనింక ఆపరేషన్ చేయించేసుకుంటాను అని ఎంత చెప్పినా విన్లేదు తను

ఆఖరిసారి.. మరొక్కసారి చూద్దామండీ అని మొండిపట్టు పట్టింది తప్పలేదు నాకు.

డాక్టర్లు చెప్తూనే ఉన్నారు ఈ మూడవసారి ఏమాత్రం అజాగ్రత్తగావున్నా బిడ్డతో బాటు తల్లి ప్రాణానికి కూడా ప్రమాదమేనని

అందుకే బిడ్డ కడుపులో పడ్డదగ్గర్నుంచీ గాజుబొమ్మలా చూసుకుంటున్నాను తనని

ప్రసవం సహజంగా అయ్యే ప్రశ్నలేదు సిజేరియన్ చెయ్యవలసిందేనన్నారు డాక్టర్లు

నెలలు నిండి ప్రసవ సమయం దగ్గరవడుతున్న కొద్దీ పరీక్షకెళ్ళే విద్యార్థి మనసులా తయారయింది నా మనసు.

త్వరగా అయిపోతే బాగుండునని ఒకసారి...

ఇంత త్వరగా అవకపోతే బాగుండునని మరోసారి

ఆఖరి కారోజు రానేవచ్చేసింది

ఆందోళనని అణుచుకొంటూ సాగరికీ అత్తగారికీ కాఫీ తేడానికి ఆస్పత్రి పక్కనే వున్న కాంటీన్‌కి బయల్దేరాను

'ఆస్పత్రి కాంటీన్' అన్న పేరేకానీ ఆస్పత్రికీ దానికీ ఏమి సంబంధంలేదని వచ్చినరోజే తెలిసింది

సాగరికి ఇంకా అప్పుడే నొప్పులు మొదలయ్యాయి మరో రెండుమూడు గంటలదాకా ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్ళరని తెలుసు

బ్లడ్ బాటిలు రిజర్వుచేసి ఉంచుకోడం దగ్గర్నుండి అన్ని ఏర్పాట్లూ చేసేసుకొన్నా ఆందోళన ఆగనంటోంది

ఆపరేషన్ థియేటర్లో అప్పటికే సిద్ధంగా ఉంచిన కత్తులూ. కత్తెర్లూ నా ఎదురుగా వచ్చి నా చుట్టూ తిరుగుతూ శరీరాన్నంతా కసుక్కు కసుక్కుమని పొడుస్తున్నట్లు అనిపిస్తోంది

కాంటీన్‌లో కెళ్ళి టేబుల్ ముందు కూర్చొని ఒక కప్పు కాఫీకి ఆర్డరిచ్చి మరో రెండు కప్పులు ఫ్లాస్కులో పొయ్యమని సర్వరుకి ఫ్లాస్కు నందించాను ఇంకా పూర్తిగా తెల్లారక పోయినా టేబుళ్ళన్నీ నిండుగా ఉన్నాయి

సర్వరు తెచ్చిపెట్టిన కప్పు నోటి దగ్గర పెట్టుకో బోతుండగా వినపడిందా అరుపు కాదు ఆ ఏడుపు ఓ కుక్క వికృతంగా వేసిన ఆ ఊళ

మృత్యుదేవత గృహం ముందున్న తుప్పు పట్టిన సింహద్వారం కీచుమని తెరుచుకొన్నట్లు

మృత్యుదేవత కౌగలించుకొన్న వేల మంది మనుష్యులూ కలిసి కట్టుగా ఏడుస్తున్నట్లూ

తాగబోతున్న కప్పుని కింద పెట్టేశాను అప్పుడు వినిపించాయి గల్లాపెట్టె దగ్గర కూర్చొన్న కోటయ్య మాటలు

ఇయ్యాల కుక్క ఏడ్చింది రోయ్ అంటే



అస్పత్రి నొంచీ ఓ సెవం నెగుస్తుందన్న మాటే! ఏటంటావురా రాములూ?

రాములన్న ఆ సర్వరు కోటయ్య వైపు తిరిగి పళ్ళికిలిస్తూ నవ్వాడు

'నిజమేనండీ గురూగారో . ఇయ్యాల సెవం నెగటం కాయం!

రాములు మాటలకి తనేదో పెద్ద ఘనకార్యం చేసినట్టు విరగబడి నవ్వాడు కోటయ్య

తలెత్తి చుట్టూ చూశాను

టేబుళ్ళ ముందు కూర్చొన్న అందరి మొహాలూ తెల్లగా పాలిపోయి ఉన్నాయి అక్కడ కూర్చొన్న వాళ్ళలో ప్రతి ఒక్కరూ తమ బంధువుల్నో, స్నేహితులనో ఎవరో ఒకరిని అస్పత్రిలో చేర్చిన వాళ్ళే!

అందరి మొహంలోనూ బయం స్పష్టంగా కనపడుతోంది

కోటయ్య వైపు చూశాను

అతను ఇటు అటు కదిలినప్పుడల్లా సిల్కు చొక్కా మీద వేలాడుతున్న బంగారు గొలుసుకున్న పులిగోరు పతకం కూడా ఇటూ అటూ కదులుతోంది

కోటయ్య గుండెల మీద ఆ పులిగోరు పతకాన్ని చూస్తుంటే ఓ పులిని చూసినట్లే అనిపించింది

అనవలసిన మాట అనేసి నాలుగు ఉంగరాల్తో మెరిసి పోతున్న నాలుగు వేళ్ళనీ చురుగ్గా కదిలిస్తూ చేతిలోని నోట్లు లెక్క పెడుతున్నాడతను

యజమాని వేసిన జోకుకి నవ్వడం తన బాధ్యత కాబట్టి నవ్వేసి తన పని నిర్లిప్తంగా చేసుకు పోతున్నాడు రాములు

ఇద్దరి మీదా కోపం ఉవ్వెత్తున లేచింది కుర్చీని విసురుగా వెనక్కు తోసి లేచి కోటయ్య వైపు నడిచాను

ఏమంటున్నావ్ నువ్వు? తెలిసే అంటున్నావా? విసురుగా అడిగాను

నిర్లక్ష్యంగా చూశాడతను

ఏటయ్యా నా మీద ఎగుర్తావేటీ నేనేం సేసినా మద్దిన? అన్నాడు నోట్లు లెక్క పెట్టడం ఆపకుండానే.

# జాతస్య హి ధృవో మృత్యు...

ఏమన్నావో నీకు తెలియదూ?

అతను నోట్లు డ్రాయర్లో పడేసి నా వైపు తలతిప్పాడు

సూడు గురూ! కుక్క ఏడిస్తే సెవం వెగుస్తాదన్న ఇసయాన్ని నువ్వు నమ్ముతావా లేదా?' నా వైపు హేళనగా చూస్తూ అడిగాడు

నేను నమ్మడం, నమ్మక పోడంతో నీ కేమిటి సంబంధం? చిరాగ్గా అడిగాను

అక్కడే ఉంది గురో పాయింటు ఆ ఇసయం మీద నీకు నమ్మకం లేదనుకో నే నా మాటన్నా నువ్వు పట్టించుకో కూడదు నీ కెట్టాగూ నమ్మకం లేదు కాబట్టి ఒకేల ఈ ఇసయాన్ని నువ్వు నమ్ముతావనుకో, నే నా మాట అన్నా అనక పోయినా సెవం నెగటం ఎట్టాగూ జరుగుతాది నా మాట కొత్తగా సేసిందేం లేదు'

తన తెలివికి తనే మురిసిపోతూ రాములు వైపు చూశాడు కోటయ్య మామూలుగానే నవ్వాడు రాములు

మనస్సు ఉడికి పోతున్నా ఆ సమయంలో కోటయ్యతో వాదన పెట్టుకొనే ఓపికా లేదు సమయమూ లేదు

అవతల అస్పత్రిలో సాగరికి నొప్పులు మొదలయ్యాయి త్వరగా తీసి కెళ్ళి కాఫీ ఇచ్చేయాలి

కాఫీ ఫ్లాస్కు తీసుకొని మౌనంగా బయట కొచ్చేశాను

* * * * * * *

ఉదయిస్తున్న సూర్యుడి కిరణాలు కంట్లో పడి గుచ్చుకోడంతో ఈ ప్రపంచంలో కొచ్చాను

సరిగ్గా గంటన్నరయింది ఆ కుక్క ఏడుపు విని

అప్పట్నుంచీ కుక్క ఏడుపూ మనసు లోంచి బయటకు పోలేదు కోటయ్య మాటలు కూడా!

శకునాలను గురించిన నిజా నిజాల గురించి నేనెప్పుడూ అంతగా భయపడి పోలేదు

అలాగని అవన్నీ అబద్ధమని ఎప్పుడూ ఎవరితోనూ వాదించనూ లేదు అసలిటువంటి వాటి గురించి ఆలోచించనే లేదెప్పుడూ

బహుశ ఆ కుక్క ఏడుపు కంటే తర్వాత కోటయ్య అన్నమాటలే నన్నెక్కువ భయ పెడుతున్నాయేమో!

నేనే కాదు అప్పుడా కాంటీన్‌లో కూర్చొన్న పదిహేను మందీ ఈసరికి నాలాగే ఆందోళనతో సతమతమై పోతున్నారేమో!

పొద్దున్నే కాంటీన్ నుంచి తీసి కెళ్ళిన కాఫీ ఫ్లాస్కుని అత్తగారి కందించేశాక, ఎదురుగా ఉన్న సాగరి మొహాన్ని చూస్తూ కూర్చోనూలేక, సాగరి నొదిలేసి బయట వరండాలో కెళ్ళిపోనూ లేక ఆ పరిస్థితి నుంచి తప్పించుకొందికి ఇలా అస్పత్రి డాబామీది కొచ్చేశాను ఎలాగూ మరో రెండు గంటల దాకా థియేటర్‌లోకి తీసి కెళ్ళరని తెలిసి

టైము చూసుకొన్నాను సాగరిని అపరేషన్ థియేటర్ లోకి తీసి కెళ్ళే సమయం దగ్గరపడుతోంది కిందకు నడిచాను

మెట్లు దిగుతుంటే గుండె బరువెక్కింది ఆ మెట్లు అలా అఖరవకుండా ఉంటే బాగుండునని పించింది

మరో అరగంటలో నే సాగరిని అపరేషన్ థియేటర్ లోకి తీసుకు పోయారు మెడదాకా తెల్లటి దుప్పటితో మొహం నిండా అంతవరకు అనుభవించిన ప్రసవవేదన తాలూకు అలసటతో ఇదే అఖరి చూపన్నట్లు థియేటర్‌లోకి తీసి కెళ్ళేముందు తను నా కేసి చూసిన చూపుతో మనస్సులో మళ్ళా ఆ కుక్క ఊళా, కోటయ్య మాటలూ కదిలి బయపెట్టాయి

అన్నీ సవ్యంగా జరిగితే సాగరి ఆ థియేటర్‌లోంచి బయట పడ్డానికి గంటపైనే పడుతుంది

అంతవరకూ థియేటర్ బయట వేసిన బెంచిమీద కూర్చొని క్షణం క్షణం నరాల్ని తెంపేటంత ఉద్రేకాన్ని భరించ లేను

ఈ గంటలోనూ ఏదో చెయ్యాలి!

ఏదో మంచిపని మనసులోని ఆందోళననీ భయాన్నీ మరిపించే ఏదో చిన్న పని!

నాకు హటాత్తుగా పొద్దున్న కాంటీన్లో కూర్చొన్నప్పుడు కోటయ్య ఆ మాట అన్నాక అక్కడ కూర్చొన్న మనుష్యుల మొహాల్లోని భయం గుర్తొచ్చింది. ఈ గంటలోనూ ఏం చెయ్యగలనో తెలిసింది

అత్తగారి నలాగే ఒదిలేసి కాంటీన్ వైపు నడిచాను ఆ గల్లాపెట్టె ముందు అలాగే చిద్విలాసంగా కూర్చొనున్నాడు కోటయ్య

కాంటీన్‌లోని మనుష్యుల సంఖ్య కూడా రెట్టింపయింది.


నేను తిన్నగా కోటయ్య దగ్గరికే నడిచాను

పొద్దున్న నువ్వడిగిన ప్రశ్న గుర్తుందా? సూటిగా అడిగాను

తిన్నగా వచ్చి గబుక్కున ఆ ప్రశ్న అడిగేసరికి మొదట తెల్లబోయినా తర్వాత నిర్లక్ష్యంగా నవ్వేశాడు

ఏం ప్రశ్న గురో? ఏం తెలియనట్లే అడిగాడు

అదే . కుక్క ఏడిస్తే శవం లేస్తుందా అన్న విషయం మీద నాకు నమ్మకముందా అని



అడిగావుగా?'

'అయితే ఏటయిం దిప్పుడు? విసుగ్గా మొహం పెట్టి అన్నాడు

ఇప్పుడు నేనే నిన్నా ప్రశ్న అడుగు తున్నాను నువ్వు చెప్పు. నీకా విషయంలో నమ్మకముందా?' సూటిగా అడిగాను

ప్రశ్న అడుగుతానని ఊహించలేదేమో కాస్త తడబడ్డట్టు చూశాడు తర్వాత తాపీగా "నేను నమ్మడం నమ్మకపోడంతో నీకేటి సంబంధం? అని అచ్చుపొద్దున్న నేనన్నట్టుగానే అన్నాడు

సరే చెప్తున్నా విను నువ్వు నిజంగా ఆ విషయాన్ని నమ్మావే అనుకో ఇక్కడికొచ్చే పేషెంట్ల డబ్బు మీదే నువ్వు బతుకుతూ కూడా ఆస్పత్రిలోంచి ఓ శవం లేస్తుందన్న విషయాన్ని నువ్వంత సంతోషంగా చెప్తున్నావంటే నీలో రాక్షసత్వం ఉందన్న మాట! ఆ విషయాన్ని నువ్వు నమ్మలేదే అనుకో నువ్వు నమ్మని విషయాన్ని కూడా అంత బాహాటంగా అంత గట్టిగా చెప్తూ అందర్లో లేని భయాన్ని పుట్టిస్తున్నావంటే అలా పుట్టించి సంతోషిస్తున్నావంటే నీలో పిశాచత్వం ఉందన్నమాట!

అనవలసిన మాట అనేసి అతను వెనకనించి చూస్తున్న కొరకొర చూపుల్ని పట్టించుకోకుండా బయటకొచ్చేశాను

మాటలతో మనుషులు మారతారా? ఏమో?

అతను మారితే ముందు ముందు నాలాంటి కొందర్ని చావు భయం నుంచి తప్పించానన్న తృప్తి మిగులుతుంది

మారకపోతే? ఏమో నాకు తెలియదు!

ఆపరేషన్ పూర్తవడానికింకా అరగంటకి పైనే టైముంది థియేటర్ ముందర బెంచి మీద కూర్చొని ఆ ముప్పై నిమిషాల్నీ ముప్పై యుగాలు చేసుకో బుద్ధి పుట్టలేదు

మళ్ళా బాబా మీదికే దారి తీశాయి నా కాళ్ళు

అదే సముద్రం అవే అలలు.. అదే నురుగు

జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ

తస్మాద పరిహార్యే ర్థే నత్వం శోచితు మర్హసి' అని చెవిలో గుసగుసలాడుతున్నట్టు

'పుట్టిన వాడికి చావూ తప్పదు చనిపోయిన వాడికి పుట్టుకా తప్పదు తప్పనిసరైన ఈ విషయం గురించి నువ్వెందుకింత దుఃఖిస్తావ్?' అని నిలదీసి అడుగుతున్నట్టు

కాని అలలు చెప్పే ఆ గుసగుసల్ని పట్టించుకొనే స్థితిలో లేదు నా మనసు దాని మానాన అది ఆలోచిస్తూనే ఉంది

ఈసరికి ఓ కత్తి నాగరిపొట్టని సర్రుమని చీల్చి ఉంటుంది.

సముద్రపుటలల్లాగే చిమ్మన రక్తం ఎగిసి ఉంటుంది.

ఒడ్డుకొచ్చిన అలలు తలలు వాల్చేసినట్లే సాగరి కూడా జీవంలేని తలను ఓ పక్కకు వాల్చేసి ఉంటుంది.

ఊహూ ఈ సముద్రాన్ని చూస్తున్నా భయాలు పారిపోడం లేదు! అక్కడ ఎక్కువ సేపు నిల్చోలేక కిందికి దిగి వచ్చేశాను

ఆ తర్వాత అరగంట తర్వాత వినిపించింది బిడ్డ కేరుమన్న ఏడుపు మరో గంట తర్వాత పక్కమీదికి చేరింది సాగరి అనస్తీషియా మత్తులో

బెడ్ పక్కనే ఉన్న ఉయ్యాల్లో కొత్తగా జీవం పోసుకొన్న పసిబిడ్డ తాలుకు చిన్నచిన్న చేతులూ కాళ్ళూ చిరుగాలికి కదిలే పూలరెమ్మల్లా కదిలాయి


గండం గడిచింది అనుకొన్నానేను తేలిగ్గా నిట్టూరుస్తూ

కాని పూర్తిగా కాదని చెప్పింది డాక్టరు

చాలా బలహీనంగా ఉందట సాగరి మరో ఇరవై నాలుగ్గంటల బాటు అతి జాగ్రత్తగా చూసుకోవాలట.

నిట్టూర్చి ఇంటికి బయల్దేరాను పాపకి కావల్సిన వస్తువులు తేడానికి

* * *




మిట్ట మధ్యాహ్నం ఎండ నిప్పులు చెరుగుతున్న వేళ తిరిగి ఆస్పత్రిలో కడుగు పెట్టాను.

గేట్లోంచి లోపలికెళ్తూ వెనక్కు తిరిగి కాంటిన్ వైపు చూసేసరికి ఏదో అసహజత్వం కనిపించింది

కాస్సేపట్లోనే తెలిసిపోయిందా అసహజత్వం ఏమిటో

కాంటీనంతా ఖాళీగా ఉంది కిటికీలన్నీ మూసేయడంతో చీకటి చీకటిగానూ ఉంది

నేను ఈ నాలుగు రోజుల్నించి ఎప్పుడూ దాన్ని చూడలేదలా

ఏమయిందో ననుకొంటూనే మెట్లెక్కి మొదటి అంతస్థులో ఉన్న సాగరి గది వైపు నడిచాను

అనస్థీషియా మత్తులోంచి బయటపడిన సాగరి బలహీనంగా నవ్వింది. ఉయ్యాల్లో పాప అదమరచి నిద్రపోతోంది

మరో ఇరవైగంటలు ఈ గాజు బొమ్మని జాగ్రత్తగా కాపాడుకోవాలి!

గుండె బరువుగా మూల్గింది

ఓ పావు గంటసేపు సాగరికతో పాప గురించి మాట్లాడి, మరో పావుగంటసేపు అత్తగారితో సాగరి గురించి మాట్లాడి కుర్చీలో విశ్రాంతిగా వెనక్కు వాలబోతుంటే అప్పుడు గుర్తొచ్చింది కాంటిన్ విషయం

అత్తయ్యగారూ ఇవాళ కేంటీనంతా ఖాళీగా ఉందేమిటి? కుర్చీలో ఆసక్తిగా ముందుకొంగి అడిగాను

'నీకు తెలియదా నాయనా? పొద్దున్న నువ్వలా ఆస్పత్రి నుంచి వెళ్లావా మరో గంటకే ఎంత ఘోరం జరిగిందో తెలుసా?

ఏమయిందండీ? ఆత్రంగా అడిగాను.

ఆ కాంటీన్లోంచి పది పన్నెండేళ్ల పిల్లలిద్దరు ఒకరినొకరు తరుముకొంటూ పరిగెత్తుకొంటూ రోడ్డు మీది కొచ్చేశారట! అదే టైముకి అట్నుంచి పాల లారీ స్పీడుగా వస్తోందట! ముందు పరిగెత్తుతున్న కుర్రాడు తప్పించుకొన్నాడు వెనక పరిగెడుతున్న కుర్రాడు లారీ క్రింద పడిపోయాడు!'

పొద్దున్న ఇంటికెళ్లిన దగ్గర్నుండీ ఇప్పటిదాకా మరిచిపోయిన ఆ కుక్క ఊళ మళ్లీ వికృతంగా మనస్సులో మార్మోగింది

కుర్రాడు కుర్రాడు బతికాడా?' మనసు చిక్కబట్టుకుంటూ అడిగాడు

కుర్రాడి ప్రాణం పోలేదట బాబూ, కాని పరిస్థితి కాస్త సీరియస్‌గానే ఉందట బోల్డు రక్తం పోయిందట. రక్తం వెంటనే ఎక్కించకపోతే కుర్రాడు బతకడట అదేదో బీ నెగిటివ్ గ్రూపట! ఆ గ్రూపు రక్తం త్వరగా ఎక్కడా దొరకదటగా? చాలా సేపట్నుంచి నర్సులూ, డాక్టర్లూ ఆ విషయమే చెప్పుకుంటూ గాభరాగా అటూ ఇటూ తిరుగు తున్నారు మరో గంటలో రక్తం ఎక్కించకపోతే ప్రాణం పోతుందట"

కడుపులో పేగులు సన్నగా కదిలాయి

'ప్చ్! ఎవరబ్బాయో? స్వగతంలో అనుకొంటు న్నట్టు అన్నాను

'ఆ ఇద్దరు పిల్లలూ కాంటీన్ వాళ్ల పిల్లలేనట

# జాతస్య హి ధ్రువో మృత్యు...

బాబూ ఒకడేమో ఆ కాంటీను ఓనరు కోటయ్యలేడూ అతని కొడుకట మరొకడేమో కాంటీన్లో సర్వరు ఎవడో రాములట అతని కొడుకట ఇందాక గది తుడవడానికొచ్చిన ఆయాలు చెప్పుకొంటుంటే విన్నాను ఇంతకూ లారీ కింద పడింది ఆ కోటయ్య కొడుకో, రాములు కొడుకో తెలియనే లేదు'

ఉలిక్కిపడ్డాను

పొద్దున్న ఆ మాట అంటున్నప్పుడు కోటయ్య మొహంలో కనిపించిన సాడిస్టిక్ సంతృప్తి, దానికి వంత పాడుతున్నట్టు రాములు మొహంలో కనిపించిన నవ్వూ గుర్తొచ్చాయి

లారీ కింద పడిన ఆ కుర్రాడు కోటయ్య కొడుకేనేమో?

అవునంతే అయ్యుంటుంది'

ఎన్నెన్నో కథలు చదివాను

జనాన్ని మోసం చెయ్యడానికి కల్తీ మందులు ఒకడు తయారు చేస్తే ఆ కల్తీ మందు తన కొడుకే తాగి చచ్చిపోతాడు

పైశాచికానందం కోసం ఒకడు చీకట్లో దారిన పోయే పిల్లను రేప్ చేసేస్తే ఆ పిల్ల తన కూతురేనని తర్వాత తెలుస్తుంది మరొకడికి,

అటువంటి కథలు చదివినప్పుడల్లా అనుకొనే వాడిని నిజంగా ఇలా జరుగుతుందా అని'

కాని ఇప్పుడలాగే జరిగింది

బీ నెగిటివ్ గ్రూపు రక్తం ముందుగా రిజర్వు చేసి ఉంచుకొంటే తప్ప దొరకడం కష్టం

గంటలో ఎలాగూ రక్తం దొరకదు' అంటే. \ తన కొడుకు చావు చూసుకొని తను పొద్దున్న అన్న మాటలు తలచుకొని కుమిలి కుమిలిపోతాడా కోటయ్య

మరెప్పుడూ జన్మలో అలాంటి మాటలనడు'

ఏదో సంతృప్తి బ్లాటింగ్ పేపర్ మీద సిరా చుక్కలా మనసులో విస్తరించబోతూ చప్పున ఆగిపోయింది

తండ్రిలో మార్పు కోసం కొడుకు బలై పోవడం తలచుకొంటూ సంతోషపడుతోందేమిటి నా మనసు?

అయినా లారీ క్రింద పడ్డ ఆ కుర్రాడు కోటయ్య కొడుకు కాదేమో? రాములు కొడుకేనేమో

ఈ రాములు ఏ మాటా అనేకపోయినా పొద్దున్న తన యజమాని ఆ మాటంటున్నప్పుడు వంత పాడి మనుష్యుల్లోని భయాన్ని పెంచడానికి యదాశక్తి ప్రయత్నించాడు'

తన కొడుకు బతికినా, చనిపోయినా సరే కనీసం ఈసారింకెప్పుడూ తన యజమాని మాటలకి తాళం వెయ్యడు!

ఎక్కడో నా ఊహల్లో ఏదో వెలితి ఉన్నట్టూ... ఆ వెలితి కడుపులో తిప్పుతున్నట్టూ అనిపించింది నాకు.

అసలు లారీ కింద పడిన కుర్రాడెవరో తెలుసుకోవాలి ముందు'

నర్సుల డ్యూటీ రూములోకి వెళ్లాను కనుక్కోవడానికి.

అతను రాములు కొడుకట' దెబ్బలకి కుట్లు వెయ్యడానికి ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్లారట'.

ఆపరేషన్ థియేటర్ వేపు నడిచాను

పొద్దున్న నేను కూర్చొన్న బెంచీమీదే కూర్చున్నారు రాములూ, కోటయ్యా రాములు మొహం మోకాళ్లలో ఉంది కోటయ్య చూపులు ఆపరేషన్ థియేటర్ తలుపుల మీద ఉన్నాయి

అడుగుల చప్పుడు విని తలలు తిప్పి చూశారిద్దరూ నా వైపు

చింత నిప్పుల్లా ఉన్న కళ్లతో రెండు సెకెండ్లు పట్టి పట్టి నా వైపు చూసి మళ్లా మోకాళ్లలో తల దాచేసుకున్నాడు రాములు.

కోటయ్య మాత్రం నెమ్మదిగా బెంచిమీంచి లేచి నాకెదురుగా నిల్చుని నా చేతులు పట్టుకున్నాడు

చూశావా గురూ! కుర్రెద్దించని సెవం లెగుత్తాదన్నా కాని ఆ సెవం ఈ రాములు కొడుకుదే అవుతాదేమో అనుకొంటె గుండెలెట్టా అలిసిపోతుండాయో' అయినోళ్ల సావు ఇంత భయపెడ్తాదా గురో? సావుకీ బతుక్కీ మద్దెన దూరం ఇంత తక్కువా గురూ' నా చేతులు పట్టుకొని కంపిస్తున్న గొంతుతో అన్నాడు నాకు తెలుసు గొంతులోని ఆ జీర కేవలం రాములు కొడుకు గురించే కాదని కుర్రాళ్ళిద్దరూ రోడ్డు మీదికి పెట్టిన పరుగు కొన్ని సెకెండ్లు ఆలశ్యమై ఉంటే రాములు కొడుకు జాగాలో తన కొడుకే ఉండేవాడని'

చాలు' నాక్కావలసింది దొరికిపోయింది'

ఇంకా పూర్తిగా దొరకలేదని మనసు ఏ మూల నుంచో చిన్న మూల్గు వినిపించింది

మోకాళ్లలో తల దాచుకొన్న రాములు వైపు చూశాను

అతని గుండెలు మురికొడుతున్నాయి అతని శరీరం మురికొడుతోంది అతని జీవితమే మురికొడుతోంది

అతను చేసే ప్రతి పనీ ఈ కోటయ్యకే 'వెచ్చించే ప్రతి నిముషం ఈ కోటయ్యకే నవ్వే ప్రతి నవ్వూ కూడా ఈ కోటయ్యకే

పొద్దున నవ్విన ఆ నవ్వుతో సహా !

లారీ క్రింద పడినవాడు కోటయ్య కొడుకేనేమో చచ్చిపోతాడేమోనని కొన్ని నిమిషాల క్రితం ఎంత తెలివి తక్కువగా ఆలోచించాన్నేను'

తన కొడుక్కే ఇలా అయితే ఎన్ని వేలు ఖర్చయినా ఊరంతా గాలించి రక్తం తెప్పిస్తాడు ఈ ఊర్లో దొరక్కపోతే ప్లేన్‌లో ఏ బొంబాయి నుంచో అయినా తెప్పిస్తాడు' రాములు కొడుక్కాబట్టి ఆస్పత్రిలో చేర్పించేసి చేతులు దులుపుకున్నాడు

అసలు కోటయ్యకూ నాకూ ఏం తేడా?

చావు గురించి భయపెట్టి సాడిస్టిక్ నవ్వు నవ్వుకొన్నాడతను'

చెయ్యగలిగిన పని చెయ్యడం మానేసి నిర్లిప్తంగా ఊరుకోబోతున్నాను నేను' నాలాంటి వాళ్ళకీ, కోటయ్యలాంటి వాళ్ళకీ కేవలం చావు మాత్రమే భయం

రాముల్లాంటి వాళ్ళకి బతుకే ఒక భయం'

చావు భయంలోంచి ఎవరినైనా తప్పించడంలో గొప్పతనమేముందీ? బతుకు భయం నుంచీ తప్పించడంలో ఉంది కానీ

ఇంకెప్పుడూ కోటయ్య ఆ మాట అనడు అని నేననుకొంటున్నప్పుడు నా మనసులో ఏం వెలుస్తుందో నాకర్థమైపోయింది'

మరో పది నిముషాలకల్లా అపరేషన్ 'థియేటర్ ముందు నిల్చుని కంగారుగా ఇటూ అటూ చూస్తున్న నర్సుతో అన్నాను

నా బ్లడ్ గ్రూప్ బీ నెగిటివ్' అపరేషన్ చేస్తున్న ఆ కుర్రాడికి ఎక్కించండి' అని

* * * * *

తెల్లారు ఝామున చిరు చీకట్లో ఎలా ఉందో పొద్దు పోయే ముందు ఇప్పుడూ అలాగే ఉంది సముద్రం

అయితే ఇప్పుడు

సముద్రం అప్పుడే పుట్టిన పాపాయి బోసి నవ్వులా ఉంది

సముద్రం మించి వీస్తున్న చల్ల గాలి సంతృప్తితో విడిచిన నిట్టూర్పులా ఉంది ఆస్పత్రి గోడలకున్న పెద్ద పెద్ద రాళ్ళు చావుకీ బతుక్కీ మధ్యనున్న జీవితాన్ని ఎలా అర్థవతం చేసుకోవాలో చెప్పే జ్ఞాన సోపానాల్లా ఉన్నాయి

దూరంగా చెట్ల గుబుర్లో కోయిల కూత వినిపించింది ఎక్కడో ప్రాణం పోసుకొంటున్న ఓ జీవి పుట్టుకను సూచిస్తున్నట్టు. □

